సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

క్లుప్తంగా

170 రైతుబజారు స్టాళ్లకు డ్రా



స్టాల్ నంబర్లు రైతులకు అందజేస్తున్న ఈవో కృష్ణమూర్తి

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజారులో సోమవారం 170 రైతుబజార్ స్టాళ్లకు డ్రా తీశారు. ఎస్టేట్ ఆఫీసర్ కృష్ణమూర్తి టోకెన్లను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ మార్కెటింగ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు ప్రతివారం రైతుల స్టాళ్లకు డ్రా తీస్తున్నట్లు తెలిపారు. రైతులు విధిగా వారికి కేటాయించిన స్టాళ్లలోనే విక్రయాలు చేయాలని సూచించారు. స్టాళ్లు ఉన్న రైతులు కూరగాయలు నేలమీద విక్రయించరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటెండర్ సతీష్, రెతులు తదితరులు పాల్గొన్నారు.

కొండవాలు సమస్యలపై వినతి



మేయర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ కవిత

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం కొండవాలు సమస్యలపై వార్డు కార్పొరేటర్ గంకల కవిత సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మేయర్ గొలగాని హరి వెంకట కుమారికి వినతిపత్రం అందజేశారు. కొండవాలులో వీధి కుక్కల స్వైరవిహారం, విద్యుత్ లైట్లు, మంచినీటి కొరత వంటి సమస్యలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని వినతిపత్రంలో పేర్కొన్నట్లు కవిత తెలిపారు.

ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు



షాపు యజమానికి అవగాహన కల్పిస్తున్న శానిటరీ సిబ్బంది

మద్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డు మాధవధార, మురళీనగర్ ప్రాంతాల్లో సోమవారం పలు షాపుల్లో ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల వాడడాన్ని నిషేధించాలని, వాటివల్ల కలిగే దుష్ప్రయోజనాలు వివరిస్తూ శానిటరీ సిబ్బంది అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఇకపై ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు వాడితే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. వినియోగదారులు గుడ్డ సంచులను వారితో పాటు తప్పక తెచ్చుకోవాలని సూచించారు. దుకాణ యజమానులు, తోపుడు బళ్ల వ్యాపారులు ఎవరైనా ప్లాస్టిక్ వాడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ సుధాకర్, సెక్రటరీలు, సూపర్‌వైజర్లు చిరంజీవి, గణేష్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.


పోర్టు ఆస్పత్రి రీ టెండరింగ్ కాపీలు దగ్ధం



టెండరు కాపీలను దగ్ధం చేస్తున్న సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం: పోర్టు ఆస్పత్రి ప్రైవేటీకరణకు రీ టెండర్ కాపీలను సీఐటీయూ నాయకులు సోమవారం దగ్ధం చేశారు. పోర్టు ఆస్పత్రి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న రిలే నిరాహారదీక్షలు 161వ రోజుకు చేరాయి. సోమవారం జరిగిన దీక్షలో పాల్గొన్న సీఐటీయూ పోర్ట్ యూనియన్ గౌరవాధ్యక్షుడు వీఎస్ పద్మనాభరాజు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వేల కోట్ల రూపాయల లాభాలు ఆర్జిస్తున్న పోర్టు, పోర్టు ఆస్పత్రిని ప్రైవేటీకరించాలనుకోవడం సరైంది కాదని, వేల మంది సిబ్బంది, రిటైర్డ్ ఉద్యోగుల ఆరోగ్యాన్ని ప్రైవేట్ వారి చేతుల్లో పెడితే సహించమని తెలిపారు. పోర్టుకు ఈ సంవత్సరం సుమారు రూ. 800 కోట్ల లాభాలు వచ్చాయని, దీనిలో నాలుగో వంతు ఖర్చుపెట్టినా ఆస్పత్రిలో డాక్టర్లు, సిబ్బందిని నియమించవచ్చన్నారు. కార్యక్రమంలో డీఎల్‌బీ పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు రామారావు, సీఐటీయూ నాయకులు కె. సత్యనారాయణ, జె. సత్యనారాయణ, బి. జగన్, రామలింగేశ్వరరావు, రాఘవులు, జీహెచ్ నాయుడు, లక్ష్మణ్, డి. పైడిరాజు, ఎ. యల్లారావు, ఈ. రాంబాబు, హెచ్‌ఎంఎస్ నాయకులు శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సర్వేంద్రియానాం.. నయనం ప్రధానం



గ్లకోమా కంటి చిత్రం

గ్లకోమా ఎవరికి వస్తుంది..

కుటుంబంలో గ్లకోమా చరిత్ర ఉన్నవారు, 60 ఏళ్ల వయస్సు పైబడిన వారు, కొన్ని రకాల మందులు వాడేవారు, రక్తపోటు, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు, ఆఫ్రికన్ సంతతి వారు, ఇతర కంటి సమస్యలు ఉన్న వారు, కంటికి గాయాలు అయిన వారిలో గ్లకోమా వచ్చే ప్రమాదం ఉంది.




గ్లకోమా స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న వైద్యురాలు



ముందుగా పరీక్షలు..

గ్లకోమాను ముందస్తుగా గుర్తించడానికి ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి కంటి పరీక్షలు చేయించుకోవడం మంచిది. గ్లకోమా వ్యాధి ప్రారంభంలో ఎటువంటి లక్షణాలు కనిపించవు. సరైన చికిత్స కూడా లేదనే చెప్పాలి. క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయడం ద్వారా ముందుగా గుర్తించి చిన్నపాటి చుక్కల మందుతో కంటి నరంలో ఒత్తిడి తగ్గించి దృష్టిని కాపాడుకోవచ్చు.



గ్లకోమా బారిన పడకుండా పాటించాల్సిన జాగ్రత్తలు

- క్రమం తప్పకుండా కంటి పరీక్షలు
- స్టిరాయిడ్స్ వాడకంలో జాగ్రత్త వహించాలి. లేదంటే కంటిపై ఒత్తిడి పెంచుతాయి
- ఆకుకూరలు, బెర్రీస్, రంగురంగుల పండ్లు తినడం
- వేగంగా నడవడం, వ్యాయామం కంటిలో ఒత్తిడి తగ్గిస్తాయి
- గాయాల నుంచి రక్షణ ఇచ్చే ఐవేర్ వాడటం
- తల ఒంచి ఉంచే ప్రమాదకరమైన యోగాసనాలు
- కంటిని దిండుతో నొక్కి ఉంచి నిద్రించరాదు
- ఎండలో తిరిగేవారు పోలరైజ్డ్ సన్‌గ్లాసెస్, టోపీ ధరించడం
- పొగ తాగడం మానేయడం
- రక్తపోటు, మధుమేహం అదుపులో ఉంచుకోవడం

సీతంపేట: గ్లకోమా అనేది దీర్ఘకాలిక కంటి వ్యాధి. కంటిలో ఒత్తిడి పెరగడం (ఇంట్రాక్యులర్ ప్రెజర్) వల్ల ఆప్టిక్ నరాలు దెబ్బతిని అంధత్వానికి దారి తీస్తుంది. గ్లకోమా వ్యాధి ఉన్నట్టు ప్రారంభ దశలో చాలా మందికి తెలియదు. ఎటువంటి లక్షణాలు కనిపించవు. వ్యాధిని ముందుగా గుర్తిస్తే అంధత్వం బారిన పడకుండా కాపాడుకోవచ్చు. 'దృష్టి నిశ్శబ్ద దొంగ'గా గ్లకోమాని పిలుస్తారు. క్రమం తప్పకుండా ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి కంటి ఆప్టిక్ నరాల పరీక్షలు చేయించుకోవడం ద్వారా గ్లకోమా బారిన పడకుండా దృష్టిని కాపాడుకోవచ్చు. గ్లకోమా వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన కలిగించడానికి ప్రభుత్వం ప్రతి ఏటా మార్చి 9 నుంచి 15 వరకు గ్లకోమా వారోత్సవాలు నిర్వహిస్తోంది. వారం రోజుల పాటు గ్లకోమా వైద్య నిపుణుల చేత ప్రత్యేక కంటి పరీక్షలు, స్క్రీనింగ్ పరీక్షలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది 'భవిష్యత్‌ను స్పష్టంగా చూడండి' అనే థీమ్‌తో గ్లకోమా వారోత్సవాలు ప్రారంభం అయ్యాయి. స్థానిక రామాటాకీస్ సమీపంలో ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో గ్లకోమా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు ప్రత్యేకంగా కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. గ్లకోమా వారోత్సవాల సందర్భంగా అవగాహన కథనం.

గ్లకోమా లక్షణాలు...

మసక లేదా అస్పష్టమైన దృష్టి, తీవ్రమైన కంటి నొప్పి, తలనొప్పి, వికారం లేదా వాంతులు, ప్రకాశవంతమైన లైట్ల చుట్టూ ఇంద్రధనస్సు రంగు వృత్తాలు కనిపించడం, ఆకస్మిక దృష్టి లోపం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

సాధారణ పరీక్షలతో గుర్తింపు..

ప్రారంభంలో ఎటువంటి లక్షణాలు కనిపించవు కాబట్టి ఐదు సాధారణ నొప్పిలేని పరీక్షలతో గ్లకోమాను గుర్తించవచ్చు. డాక్టర్ మీ కంటిలోని ఒత్తిడిని తనిఖీ చేస్తారు. అలాగే ఆప్టిక్ నాడిని (డైలేటెడ్ కంటి పరీక్ష) చేస్తారు. మీ దృష్టి క్షేత్రాన్ని పరీక్షించి, కార్నియా మందాన్ని కొలుస్తారు. కంటిలోని ఐరిస్, కార్నియా కలిసే కోణాన్ని పరిశీలించడం ద్వారా గ్లకోమా ఉన్నదీ లేనిదీ నిర్ధారణ చేస్తారు.

అవగాహనతోనే గ్లకోమా దూరం..



శరీరం అధిక బరువు లేకుండా చూసుకోవడం, తద్వారా రక్తపోటు, మధుమేహం బారిన పడకుండా ఉండటం, శారీరకంగా చురుగ్గా ఉండటం, ధూమపానం మానేయడం వంటి ఆరోగ్యకరమైన చర్యల ద్వారా గ్లకోమా బారిన పడకుండా ఉండవచ్చు. రెండు సంవత్సరాలకు ఒకసారి స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుంటే ప్రారంభ దశలో గ్లకోమాను గుర్తించి చుక్కల మందుతో దృష్టికి కాపాడుకోవచ్చు. ఈనెల 9 నుంచి 15 వరకు ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రిలో గ్లకోమా వారోత్సవాలలో భాగంగా వైద్య నిపుణుల చేత స్క్రీనింగ్ పరీక్షలు జరుగుతున్నాయి. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ వి.మీనాక్షి, సూపరింటెండెంట్, ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల.

ఘనంగా ముత్యాలమ్మ తొలేళ్లు



అమ్మవారి ప్రతిమలతో భక్తులు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డులోని నక్కవానిపాలెం గ్రామదేవత ముత్యాలమ్మ పండగ అంగరంగ వైభవంగా జరుగుతోంది. సోమవారం తొలేళ్ల ఉత్సవం నిర్వహించారు. భక్తులు ఆశీలమెట్ట అశోక్‌నగర్‌లో గల జోనల్ కార్యాలయం నుంచి రామాటాకీస్, శ్రీనగర్, సత్యం జంక్షన్ మీదుగా నక్కవానిపాలెంలోని అమ్మవారి ఆలయానికి ఘటాలతో చేరుకున్నారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారి ప్రతిమలను ఊరేగింపుగా తీసుకురావడంతో కాలనీలో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ముత్యాలమ్మ అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 11న అనుపు మహోత్సవం జరుగుతుంది. 18వ తేదీన మారువారం ఉత్సవాలు ఘనంగా జరుగుతాయని కమిటీ ప్రతినిధులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాటిచెట్లపాలెం: సుబ్బలక్ష్మీనగర్ 11 కేవీ పరిధిలో చేపడుతున్న నిర్వహణ పనుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్–1 ఈఈ బి. సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. తాటిచెట్లపాలెం, తాటిచెట్లపాలెం బజార్, రైల్వే క్వార్టర్స్, రైల్వే ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్, రెడ్డి తాటిచెట్లపాలెం, రైల్వే న్యూకాలనీ, 28 బస్టాప్, కరుణామయ పెట్రోల్ బంక్, పరదేశమ్మ గుడి, సంతోషిమాత గుడి ప్రాంతాల్లో ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

భద్రతపై విద్యార్థులకు అవగాహన



ప్రమాదాల నుంచి రక్షణ పొందే విధానాన్ని విద్యార్థులకు వివరిస్తున్న నిపుణులు

మురళీనగర్: ఆపద సమయంలో భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ఆధ్వర్యంలో మురళీనగర్ జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. హెచ్‌ఎం బి.హేమలత అధ్యక్షతన విశాఖలోని ఏ/10 ఎన్‌డీఆర్‌ఎఫ్ ఎస్ఐ జి.ఈశ్వరరావు ఆధ్వర్యంలో బృంద సభ్యులు భద్రతా విధానాలను విద్యార్థులకు వివరించారు. విపత్కర పరిస్థితులు, అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఆపదలో ఉన్నవారిని రక్షించే పద్ధతులు తెలిపారు. గుండె పోటు వచ్చిన వారికి కార్డియో పల్మనరీ రెస్పిరేషన్ (సీపీఆర్) వంటి ప్రాథమిక చికిత్సను విద్యార్థులతో సాధన చేయించి చూపించారు. సుడిగాలులు, పిడుగులు పడినప్పుడు వాటి నుంచి రక్షించుకునేందుకు అనుసరించాల్సిన జాగ్రత్తలను వివరించారు. పాఠశాలల్లో విద్యార్థుల భద్రతకు తీసుకోవాల్సిన చర్యల గురించి తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 2 వినతులు



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ రాము

కంచరపాలెం: జీవీఎంసీ జోన్–5 జ్ఞానాపురం కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 2 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి జోనల్ కమిషనర్ బి. రాము వినతులు స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. రెవెన్యూ విభాగానికి 1, పబ్లిక్ హెల్త్ విభాగానికి 1 వినతి అందినట్లు జెడ్సీ రాము తెలిపారు. పరిష్కార వేదికలో వచ్చిన వినతులను తక్షణం పరిష్కరించాలన్నారు. జోన్ పరిధిలో టౌన్‌ప్లానింగ్‌పై అధికంగా ఫిర్యాదులు అందుతున్నాయని, వార్డు పర్యటనలో అధికారులు విధిగా పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ తారా ప్రసన్నరెడ్డి, డీఈ రామసుబ్బారావు, పబ్లిక్‌హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్, ఏపీడీవోలు కృపానందం, పుణ్యవతి, టౌన్‌ప్లానింగ్ టీపీవో ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హోలీ జోష్



కలర్ స్నో స్ప్రేలు



విక్రయానికి సిద్ధంగా వాటర్ గన్స్



హ్యామర్, బాహుబలి కత్తి, గొడ్డలి వంటి ఆకర్షణీయమైన మోడళ్లలో వాటర్ గన్స్

- ప్రారంభమైన రంగులు.. సామగ్రి అమ్మకాలు
- పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్న పిల్లలు, యువత

సీతంపేట: హోలీ పండగ వచ్చిందంటే యువతకు సందడే. శుక్రవారం హోలీ కావడంతో వేడుకలకు అవసరమైన సామగ్రి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. స్నేహితులు, కుటుంబ సభ్యులు ఒకరికొకరు రంగులు పూసుకుని వారిపై ఉన్న అభిమానాన్ని, ఆప్యాయతను చాటుకుంటారు. వారిలో మరింత ఉత్సాహాన్ని నింపేలా వివిధ రకాల రంగులు, ఒకరిపై మరొకరు జల్లుకునేందుకు వాటర్ గన్స్, పంప్స్ ఆకర్షణీయమైన మోడళ్లలో మార్కెట్‌లో కొలువుదీరాయి. రంగులు పూసుకోవడం వల్ల చాలా మంది చర్మానికి ఇరిటేషన్ కలుగుతుంది. అందుకని చర్మానికి హాని చేయని సహజసిద్ధమైన రంగులను దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులు తెప్పించి అమ్మకానికి సిద్ధం చేశారు. ప్రత్యేక స్టాల్స్ ద్వారా రూ.10 నుంచి 50 వరకు ప్యాకింగ్‌లలో రంగులను విక్రయిస్తున్నారు. కోల్‌కతా, ముంబాయి, ఢిల్లీ, హైదరాబాదు నుంచి దిగుమతి చేసుకున్న ఈ గన్స్ రూ. 30 నుంచి రూ.2000 ధరల్లో లభ్యమవుతున్నాయి, అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్‌లో పాలబూత్ సెంటర్ వద్ద విక్రయిస్తున్న వాటర్ గన్స్, పంప్స్ యువతను బాగా ఆకర్షిస్తున్నాయి. బాహుబలి కత్తి, తార్‌హ్యామర్, గొడ్డలి, కాంక్రీట్ మిక్సర్, ట్రిపుల్‌బ్యారల్ గన్, డైనోసార్, మేజిక్ గ్లాస్, బ్యాక్‌ప్యాక్ గన్స్, కలర్ స్నో స్ప్రేలు.. ఇలా పలు రకాల మోడళ్లలో వాటర్ గన్స్ చిన్న సైజు నుంచి భారీ సైజు వరకు విక్రయిస్తున్నారు. సీతంపేట మెయిన్‌రోడ్, శంకరమఠం రోడ్, అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్‌లలో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి హోలీ సామగ్రి విక్రయిస్తున్నారు. అన్ని వయసుల వారు పెద్ద ఎత్తున హోలీ వేడుకల కోసం కొనుగోలు చేస్తున్నారు.

చెట్టు కొమ్మలు తొలగించారు..

సాక్షి ఎఫెక్ట్..



చెట్టుకొమ్మలు తొలగించడంతో ఖాళీ అయిన ప్రదేశం

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్ రోడ్డు పక్కన పడి ఉన్న చెట్టుకొమ్మలను ఎట్టకేలకు అధికారులు తొలగించారు. 'విద్యుత్‌శాఖ సిబ్బంది నిర్లక్ష్యంతో అవస్థలు' శీర్షికన 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన వార్తకు ఈపీడీసీఎల్ సీతమ్మధార సెక్షన్ ఇంజినీర్లు స్పందించారు. ఈ చెట్టు పక్కనే పలు చెట్టు కొమ్మలు కుప్పగా పడివుండంతో ఈ మార్గంలో ట్రాఫిక్‌కి అంతరాయం కలగడం తెలిసిందే. సాక్షి కథనంతో స్పందించిన సీతమ్మధార సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ ఆదేశాలతో సిబ్బంది సోమవారం చెట్టు కొమ్మలను తొలగించారు. సాక్షి కథనంతో కొమ్మలను తరలించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

రూ.4వేలు పెన్షన్ వర్తింపజేయాలి

- ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల డిమాండ్



జీవీఎంసీగాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న యూనియన్ నాయకులు

సీతమ్మధార: ప్రభుత్వం వృద్ధులకు ఇస్తున్న పింఛన్ మాదిరిగానే ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు రూ.4 వేలు పెన్షన్‌ను ఇవ్వాలని ఏపీఎస్‌ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి ఏవీ రావు, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వీవీకే రాయ్, ఉపాధ్యక్షులు సీహెచ్ పైడిరాజు రెడ్డి, బొడ్డేటి జగతరావు డిమాండ్ చేశారు. ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ విశాఖ రీజియన్ నేతృత్వంలో సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద భారీ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మీడియాతో మాట్లాడుతూ రూ.4వేలు పెన్షన్ వర్తింపజేయాలని కోరామని, సమస్య పరిష్కారానికి ఈ నెల 14న చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టి ముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేస్తామన్నారు. ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. ఈశ్వరరావు, కోశాధికారి ఎం. జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

జోన్-3 పీజీఆర్‌ఎస్‌కు రెండు వినతులు

సీతమ్మధార : జీవీఎంసీ జోన్-3 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రెండు వినతులు వచ్చాయి. జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ రెండు అర్జీలూ టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించినవే అని జెడ్సీ తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

బైక్‌ల దొంగ అరెస్టు



మాట్లాడుతున్న క్రైం ఏడీసీపీ మోహనరావు

సీతమ్మధార: నగరంలో బైకుల దొంగతనాలకు పాల్పడుతున్న ఒక ఘరానా దొంగను అరెస్టు చేశామని ఏడీసీపీ మోహనరావు తెలిపారు. ద్వారకా పోలీస్‌స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది డిసెంబర్ 30వ తేదీన సీతమ్మధార టీపీటీ కాలనీ దరి రసపూర్ణ హోటల్ సమీపంలో గల సాయి శరణం అపార్ట్‌మెంట్స్‌లో గుంటూరు నివాసరాజు కుటుంబ సభ్యులతో నివసిస్తున్నారని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు తన బైక్ కీలను దొంగిలించారని, ఆ తర్వాత ఏపీ 31 సీజే 7375 నంబర్ కలిగిన పసుపు రంగు వెస్పా బైక్‌ను దొంగిలించారని ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు. నేరస్తులు రసపూర్ణ హోటల్, టీపీటీ కాలనీ, సీతమ్మధార సమీపంలో పార్క్ చేసిన మరికొన్ని వాహనాలను దొంగిలించి పారిపోయారని తెలిపారు. నిందితుడు భత్తుల సాయికుమార్ (22)ని టీపీటీ కాలనీలో అరెస్టు చేశామన్నారు. ఇతను నగరంలోని మద్దిలపాలెం దరి కేఆర్‌ఎం కాలనీలో నివసిస్తున్నాడని తెలిపారు. అతని వద్ద నుంచి ఆరు బైకులు స్వాధీనం చేసుకున్నాం అన్నారు. అతనిపై పీఎం పాలెం, ఎంవీపీ, త్రీటౌన్, ఫోర్త్‌టౌన్ క్రైం విభాగాల్లో కేసులు ఉన్నాయని తెలిపారు. అంతే కాకుండా ఒంగోలు జిల్లాలోని సింగరాయకొండ పోలీస్ స్టేషన్‌లో కూడా అతనిపై రౌడీషీట్ ఉందన్నారు. సమావేశంలో ద్వారకా క్రైం సీఐ వి.చక్రధరరావు , క్రైం ఎస్ఐ రాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ నార్త్
9010810033
Office mail : sakshiadvtvsp@gmail.com